హైదరాబాద్ వార్త

# ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నారా ..!

-కనీస జాగ్రత్తలు తీసుకోకపోతే నష్టాలే
-మోసాలపై అప్రమత్తత అవసరం
-ఆకర్షణీయమైన ప్రకటనలు,ఆఫర్లు నమ్మితే అంతే..



**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** అన్‌లైన్ షాపింగ్‌పై నేడు అన్ని వర్గాలవారు పెద్దపెత్తున ఆసక్తి కనబరుస్తున్నారు.ఆన్‌లైన్‌లో రకరకాల ఆకర్షణలు,ఆఫర్లతో కొనుగోలుదార్లను ఇట్టే అదరగొడుతున్నారు.షోరూంలలో కనిపించని వస్తువులు అనేకం ఆన్‌లైన్ షాపింగ్‌లో దర్శనమిస్తున్నాయి.అయితే నెట్‌లో కనిపించే ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనలన్నీ నమ్మేస్తే మనం మోసపోవడం కాయం. ప్రచారంలో చెప్పేదిఒకటి తీరా ఆర్డర్ ఇవ్వగానే ధరల్లో తేడాలు కనిపిస్తుంటాయి. దీని గురించి తిరిగి ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి ఎదురవుతుంది.ఆన్‌లైన్ షాపింగ్‌లో చాలా తక్కువ ధరలకే వివిధ రకాల ఉత్పత్తులను ఉంచుకతున్నారు. ప్రతే్యకించి ఎలక్ట్రానక్స్ ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు ఫర్నీచర్,రెడిమేడ్ డ్రెస్సెస్,కాస్మొటిక్స్,స్మార్ట్‌ఫోన్‌లు ఇలా అనేక రకాల ఉత్పత్తులు ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా షాపింగ్ చేసేందుకు అవకాశం ఉంటుంది.ఆర్డర్ ఇచ్చిన కొద్దిరోజుల్లోనే వాటిని డోర్‌డెలివరీ చేస్తున్నారు. ఇంట్లో కూర్చొని మనకు కావాల్సిన వస్తువులు హాయిగా కొనుగోలు చేసేస్తున్నాము. చూడ్డానికి వినడానికి ఇదంతా బాగానే ఉన్నా.కొన్ని సందర్భాల్లో ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారు మోసపోతున్నారు.ఆర్డర్ ఇచ్చిన వస్తువులు ఇంటికి రాగాని వాటిని చూసి అవాక్కయినవారూ చాలా మంది ఉన్నారు.

టీవీల్లోనూ,ఇంటర్‌నెట్‌లోనూ ఎక్కడ చూసినా అన్‌లైన్ షాపింగ్ ఆకర్షణీయమైన ప్రకటనలు కనిపిస్తుంటాయి. చాలా తక్కువ ధరకే వాటిని ఇస్తున్నట్లు ప్రకటిస్తారు. దీంతో చాలామంది ఆకర్షితులవుతున్నారు.దేశవిదేశాల కంపెనీలు అనేకం ఆన్‌లైన్ ద్వారా వ్యాపారాలు చేస్తూ కొనుగోలుదార్లను ఆకట్టుకుంటున్నాయి.ఆన్‌లైన్ షాపింగ్‌లో అత్యధికంగా గృహోపకరణాలు, ఫర్నీచర్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు,రెడిమేడ్ దుస్తులు అధికంగా ఉంటున్నాయి. వీటిని ఆకర్షణీయమైన ధరలతో ప్రకటనలు చేస్తుంటారు.డిస్కౌంట్‌లు ,ఒకటికొంటే మరొకటి ఉచితం ,డోర్‌డెలివరీ వంటి ఆఫర్లను చూసి పూర్తిగా నమ్మేసి షాపింగ్ చేయడం సరికాదు. ఆకర్షణీయమైన ప్రకటనలు చేసే కంపెనీలలో కొన్ని బోగస్‌వి కూడా ఉంటున్నాయి.ఇటీవల కాలంలో ఓవినియోగదారుడు ఆన్‌లైన్‌లో మొబైల్ ఫోన్ ఆర్డర్ చేస్తే..ఇంటికి వచ్చిన ప్యాకెట్‌ను ఇప్పి చూస్తే బొమ్మఫోన్‌లు,రాళ్లు వచ్చినసంఘటనలు అనేకంగా ఉన్నాయి.

### ఆన్‌లైన్ షాపింగ్ చేసేటప్పుడు గమనించాల్సిన విషయాలు..

మనం కొనుగోలు చేసే కంపనీ వివరాలు ముందే తెలుసుకొని సదరు కంపెనీ ఎలాంటి ఉత్పత్తులపై వ్యాపారం చేస్తుందో గమనించాలి.ఆన్‌లైన్‌లో విక్రయించే వస్తువులకు,షాపింగ్ మాల్స్‌లో లభించే వాటికి ధరల్లో ఏమైనా తేడాలు ఉన్నాయా లేదా తెలుసుకోవాలి. బోగస్ కంపెనీల గురించి తరుచూ పత్రికల్లోకానీ పోలీసులు గానీ చెబుతుంటారు వాటిని పరిశీలించండి.ఆన్‌లైన్ మోసాలపై చర్యలు తీసుకునేందుకు పోలీసులు ప్రత్యేక సైబర్ క్రైం విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఏమైనా అనుమానాలు ఉంటే ఈవిభాగానికి ఫిర్యాదు చేయవచ్చు.ఆన్‌లైన్ వ్యాపారాలు నిర్వహిస్తున్న కంపెనీలకు సంబంధించిన ఫోన్‌నెంబర్లు దగ్గర ఉంచుకొని వాటి అడ్రస్ గూరిచ్చ కూడా తెలుసుకోవాలి.ఆన్‌లైన్ వ్యాపారంలో అమ్మే వస్తువులు ప్యాకింగ్‌పై కంపెనీల చిరునామాలు,ఎప్పుడు తయారయ్యాయే గమనించాలి.

# కలకాలం నిలిచే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు



యువకళోత్సవ నృత్యప్రదర్శనల్లోని దృశ్యాలు

**రవీంద్రభారతి, అక్టోబరు 8 ప్రభాతవార్త :** శారద మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు కలకాలం నిలిచేవుంటాయి. పాశ్చాత్య సంస్కృతి, కళలకు ధీటుగా మన కళలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రవీంద్రభారతి ప్రధాన మందిరంలో తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో 3రోజులపాటు జరుగుతున్న యువకళోత్సవం రెండవరోజు మంగళవారం రాత్రి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు శారద అన్నారు. కళల ద్వారా మానసిక మనోవికాసంతోపాటు వ్యాయామం కూడా కలుగుతుందని, నృత్యంతోపాటు సెల్ఫ్‌డిఫెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్‌లను నేర్చుకొని ఏవిధమైన అఘాయిత్యాలు, అత్యాచారాలు, సమస్యలు ఎదురైనా ఎదుర్కొనే స్థితికి చేరుకోవాలని సూచించారు. అధ్యక్షోపన్యాసంలో డా. అలేఖ్య పుంజాల మాట్లాడుతూ యువ కళోత్సవంలో ఈనాటి రెండవరోజు ప్రఖ్యాత నాట్యగురువుల శిష్యులు భరతనాట్యం, కూచిపూడి, కథక్, పేరిణి, మోహినిఅట్టం, ఒడిస్సీ తదితర శాస్త్రీయ నృత్యాలు సుమారు వందమంది కళాకారులు అద్భుతంగా ప్రదర్శించనున్నట్లు తెలిపారు. నిన్నటి యువకళోత్సవంలో కళాకారుల సంగీత ప్రదర్శనలు చూస్తుంటే వారిలో కళలపట్ల అభిరుచి, లక్ష్యం, జిజ్ఞాస కొట్టొచ్చినట్లు కనబడిందని, మన కళలు కలికాలం ఫరిడవిల్లుతాయన్న నమ్మకం ప్రస్ఫుటమైందన్నారు. అనంతరం జరిగిన భారతీయ శాస్త్రీయ నృత్యప్రదర్శనల్లో ప్రఖ్యాత నాట్యగురువులు డా. ఆనంద్‌శంకర్ జయంత్, గీతాగణేషన్ శిష్యులచే భరతనాట్యం; డా. దీపికారెడ్డి, డా. ఉషాగాయత్రి, డా. భాగవతుల సేతురాం శిష్యులచే కూచిపూడి నృత్యం; రాఘవ రాజ్ భట్, మంగళాభట్, సంజయ్‌జోషి శిష్యులచే కథక్; డా. కళాకృష్ణ, రాజ్‌కుమార్ శిష్యులచే పేరిణినాట్యం; మైథిలి మరాట్ అనూప్, బిజిన శిష్యులచే మోహినీఅట్టం; దేబశ్రీ పట్నాయక్, సుదీప్తాపాండ శిష్యబందంచే ఒడిస్సీ నత్యప్రదర్శనలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి.

# వర్షపునీరు ..భూగర్భజలాలుగా మార్చేందుకు కృషి చేయాలి

-ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి
-వివిధ శాఖల సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్



సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మీ, దానకిశోర్, కమిషనర్ అమ్రపాలి, కలెక్టర్ అనుదీప్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** నగరంలో వర్షపునీరు వృధా కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో వరదనీటి సమస్యలను ఎదుర్కొవడం, వర్షపునీటిని పడిసిపట్టే వ్యవస్థలను మరింత మెరుగుపరచడంపై చేపట్టాల్సిన చర్యలపై ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, డిప్యూటీ మేయర్ శ్రీలత, జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి, జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి, హెచ్ఎండబ్ల్యూఎస్ ఎండీ అశోక్‌రెడ్డి, జోనల్ కమిషనర్లతో కలిసి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపునీటిని భూగర్భ జలాలుగా మార్చేందుకు ఎక్కువస్థాయిలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని అవి నీటి నిల్వకు సమర్థవంతంగా ఉపయోగపడుతాయన్నారు. వర్షనునీటి నిలువలను తగ్గించేందుకు ఇజెక్షన్ వెల్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈచర్యలు నగరంలో ప్రధానంగా వర్షపు నీరునిలిచే ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని,ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత తప్పనిసరిగా ఉండాలని ఆదిశగా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరచాలన్నారు. జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ మాట్లాడుతూ 150వార్డుల కార్పొరేటర్లను భాగస్వాములను చేసి అడిషనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను సమన్వయం చేసుకుని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకునేలా చైతన్యం చేస్తామని మంత్రికి తెలిపారు. కమిషనర్ అమ్రపాలి మాట్లాడుతూ 141 వాటర్‌లాంగిగ్ పాయిట్‌ల వద్ద నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నీరునిలువకుండా హార్వెస్టింగ్ చేస్తున్నామని .. ప్రతి ఇంటికిఇంకుడు గుంత ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

# పారిశుధ్య నిర్వాహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి

-అధికారులకు జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి ఆదేశం



రాజేంద్రనగర్ డిసితో మాట్లాడుతున్న కమిషనర్ అమ్రపాలి

**హైదరాబాద్,అక్టోబరు 8,ప్రభాతవార్త:** పారిశుద్ధ్య నిర్వాహణపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలి కాట సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం చార్మినార్ జోన్‌లోని అత్తాపూర్, రాజేంద్రనగర్, ఆరాంఘర్ , మీర్‌అలం ట్యాంక్, బహదూర్‌పురా తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వాహణ, స్థితిగతులను పరిశీలించి అధికారులకు పలుసూచనలు చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వాహణ సజావుగా జరగాలని, ఈవిషయంలో ప్రజలు పరిశుభ్రత పాటించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్వచ్ఛ ఆటోల కదలికలను ,ఇంటింటికి వెళ్లి చెత్తసేకరించేలా పర్యవేక్షించాలని తెలిపారు. అంటువ్యాధులు ప్రభలకుండా పారిశుధ్య నిర్వాహణ సక్రమంగా జరగాలని, గార్బేజ్ వల్నరబుల్ పాయింట్‌లను తొలగించాలన్నారు. అలాగే సిఅండ్‌డి వేస్ట్‌ను ప్రత్యేక వాహనాల ద్వారా తరలించేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. దోమల నియంత్రణకు యాంటీ లార్వా ఆపరేషన్ ,ఫాగింగ్ తదితరాలను చేయాలన్నారు. అదేవిధంగా రోడ్లపై ఏర్పడిన పాట్‌హోల్స్‌ను పూడ్చివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే కమర్షియల్ ఏరియాలో వ్యర్థాలు వెను వెంటనే తీసుపోయే విధంగా చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌ను ఆదేశించారు.

## దోమల నియంత్రణకు " కూల్ ఫాగింగ్ మిషనరీ "

జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ



మిషనరీలో వాడే కెమికల్‌ను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మీ, కమిషనర్ అమ్రపాలి తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** దోమల నియంత్రణకు కొత్తమార్గాన్ని అవలంభిస్తూ, కూల్ ఫాగింగ్ మిషనరీని తీసుకువచ్చినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ తెలిపారు. ఈమేరకు మంగళవారం సాయంత్రం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ఆవరణలో కమిషనర్ అమ్రపాలి కాటతో కలిసి మేయర్ కూల్ ఫాగింగ్ మిషనరీ పనితీరును పరిశీలించారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ ..ఇంతకు ముందు వాడిన హాట్‌ఫాగింగ్ మిషనరీ ద్వారా ఆరోగ్యసమస్యలు ఎదురవుతున్నాయని ,కూల్ ఫాగింగ్ ద్వారా ఆరోగ్యసమస్య ఉండదని తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఈమిషనరీని ప్రవేశపెట్టారని ,ఫైలట్ ప్రాజెక్ట్‌గా మూడు మిషన్లను ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈకూల్ ఫాగింగ్ ద్వారా అరగంటలోనే దోమలు చనిపోతాయని ,దీని ఉపయోగం డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణలో ఉండబోతుందని పేర్కొన్నారు. గుజరాత్‌లో ఇప్పటికే ఈవిధానం సక్సెస్ అయ్యిందని,హాట్ ఫాగింగ్ ద్వారా ఖర్చయ్యే డీజిల్ ధరతో ఏడాదికి కూల్ ఫాగింగ్ మిషన్లను కొనుగోలు చేయవచ్చునని వెల్లడించారు. ఈకార్యక్రమంలో ఛీఫ్ ఎంటమాలజీ డా.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయం బతుకమ్మ వేడుకలు



కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో బతుకమ్మ వేడుకలు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 8ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయంగా బతుకమ్మ వేడుకలు నిలుస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ అదనపు కమిషనర్, తెలంగాణ బిల్డింగ్ అండ్ అధర్ కన్‌స్ట్రక్షన్ వెల్ఫేర్ బోర్డు సీఈవో డాక్టర్ ఇ.గంగాధర్ అన్నారు. మంగళవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో బోర్డు ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు జరిగాయి. కార్మిక శాఖ ఉద్యోగులు, అధికారులు సంప్రదాయ దుస్తులు ధరించి వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఈ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్‌లు సునీత, శ్యామ్‌సుందర్, చంద్రశేఖర్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ నీలమ్మ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు బతుకమ్మ పూజా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేందుకు ప్రజలను ఏకతాటిపైకి తెచ్చిన ఈ కార్యక్రమం ఆనందకరమైన సందర్భం అని డాక్టర్ గంగాధర్ అన్నారు. తెలంగాణ వారసత్వాన్ని విస్తృతంగా ప్రచారం చేయడం గర్వంగా ఉందన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

-ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్

**నాంపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త :** ఆపరేషన్ కగార్ పేరిట ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో పోలీసులు చేపడుతున్న దుశ్చర్యను వెంటనే నిలిపివేయాలని ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక ప్రతినిధులు ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్, అన్వర్‌ఖాన్‌లు మాట్లాడుతూ మధ్య భారత దేశంలో గత 10నెలలుగా కొనసాగుతున్న ఆదివాసీ హత్యాకాండ ఇటీవల మరింత తీవ్రమైందని, ఛత్తీస్‌ఘడ్, అబూజ్‌మాడ్‌లోని తెల్తులి, నెందూరు అటవీ ప్రాంతాల్లో ఈ నెల 4న పెద్దసంఖ్యలో భద్రతా దళాలు భారీయెత్తున దాడిచేసి అమాయక ఆదివాసీలను నిర్దాక్షిణ్యంగా చంపివేశాయని ఆరోపించారు. ఈ ఘటనను ప్రభుత్వం ఎన్‌కౌంటర్‌గా చిత్రించిందని వారు మండిపడ్డారు. మావోయిస్టుల పేరుతో భద్రతాదళాలు కాల్చివేసిన వాళ్లలో ఆ పార్టీకి సంబంధంలేని సాధారణ ఆదివాసీలు తమ ప్రాణాలను కోల్పోయారని తీవ్ర ఆవేదన చెందారు. అటవీప్రాంతంలో ఉన్న సహజ వనరులను కార్పొరేట్ సంస్థలకు ఇవ్వడానికి అంగీకరించడని ఆదివాసీలను తుదముట్టించడానికి యుద్ధవాతావరణం సృష్టించి వారిని బయటకు పంపించేందుకు కేంద్రప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను కొనసాగిస్తుందని విమర్శించారు. 4న జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరపాలని, అడవిని, పర్యావరణాన్ని దెబ్బతీస్తున్న పరిస్థితులను ప్రభుత్వం పరిశీలించి, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా నవంబరు 3న ఇందిరాపార్క్ వద్ద పెద్దయెత్తున ధర్నా చేపట్టనున్నట్లు వారు వెల్లడించారు. ఈ సమావేశంలో వేదిక ప్రతినిధులు విరసం, నారాయణరావు, సాగర్, రవీందర్, సుదర్శన్, చంద్రమౌళి, గోవర్ధన్, జాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం నగర్ శ్రీ భూలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో మంగళవారం మహాలక్ష్మీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం

# విద్యుత్‌రంగ ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

-సిపిఐ రాష్ట్రకార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు




సదస్సులో ప్రసంగిస్తున్న కె.సాంబశివరావు తదితర నాయకులు

**నాంపల్లి, అక్టోబరు 8 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్‌రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు 19వేలమంది చాలీచాలని జీతాలతో కొట్టుమిట్టాడుతూ కాలం ఎల్లబోస్తున్నారని, వారిని రెగ్యులరైజ్ చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కోరారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన విద్యుత్ రంగ ఆర్టిజన్ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆనాటి ముఖ్యమంత్రి కెసిఆర్ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ ఎంప్లాయీస్ మారుస్తానని ఆర్భావంచేసి ఆర్టిజన్‌లు అనే పేరుతో వారి జీవితాల్లో చీకటినింపారని ఆగ్రహం చెందారు. రాష్ట్రంలో వెలుగులు నింపుతున్న ఆర్టిజన్ కార్మికులకు గత పదేళ్లుగా పదోన్నతులు, వేతనాలు పెంచకుండా ఇబ్బందిపాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. కెసిఆర్ చేసిన మోసాన్ని నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారివారి స్థానాల్లో పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐటయుసి జాతీయ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్‌గిరి కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యుత్‌రంగాన్ని ప్రైవేట్‌పరం చేయాలని కుట్రలు పన్నుతుందని, ఈ ఆలోచనను తిప్పికొట్టేందుకు కార్మికవర్గం ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎఐటియుసి రాష్ట్రాధ్యక్షుడు ఎం.డి యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, మాజీ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.బోస్ తదితరులు మాట్లాడారు. ఈ సదస్సులో ఎఐటియుసి కార్యదర్శులు నర్సింహారావు, ప్రసాద్, ఆర్టిజన్ సంఘ నాయకులు రావుల మురళి, శంకర్, లక్ష్మయ్య, ఓదేలు, రామయ్య, రాజునాయక్, ఉమా, రవి, శారద, రాములు, రాంబాయి తదితరులు పాల్గొన్నారు. ఆర్టిజన్స్ నూతన రాష్ట్ర కమిటీ : గౌరవాధ్యక్షుడుగా కూనంనేని సాంబశివరావు, గౌరవ సలహాదారులు శింగు నర్సింహారావు, రాష్ట్రాధ్యక్షుడు నరాటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బానోతు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదేలు, డిప్యూటీ కార్యదర్శి బి.లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శులుగా రాజునాయక్, కె.కృష్ణ, ఉపాధ్యక్షుడుగా ఎం. రామయ్య, పడిగె శారదలను ఎన్నుకున్నారు.

## కాటేదాన్‌లో బిజెపి విజయోత్సవ వేడుకలు



విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి,బిజెపి నాయకులు

**మైలార్‌దేవ్‌పల్లి,అక్టోబరు 8 ప్రభాతవార్త :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.హర్యానా రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మూడవ సారి బిజెపి విజయ ఢంకామ్రోగించి అధికారంలోకి వచ్చిన సందర్భంగా మంగళవారం కాటేదాన్ బిజెపి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన బిజెపి విజయోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.బాణ సంచా కాల్చి ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్ధన్‌తో పాటు బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

